క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

ఆస్పత్రి వద్ద అన్నదానం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సత్య సాయి సేవా ట్రస్ట్ ఆస్పత్రి వద్ద అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యుడు కేతిరెడ్డి మనవరాలు ఆద్యారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణా రమేష్, సభ్యులు చింతల అమర్‌నాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోపీనాథ్, వెంకట్రావ్, ఓబుల్‌రెడ్డి, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి నలుపు, తెలుపు, పసుపు రంగు డిజైన్ కలిగిన ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, పచ్చరంగుపై డిజైన్ గల షార్ట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాఠీచార్జి దుర్మార్గం

నెల్లూరు రూరల్: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న హిందూ సంఘాలపై పోలీసుల లాఠీచార్జిని బీజేపీ నేత మిడతల రమేష్ శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేసిన వారిపై పోలీసులు దాడి చేయడం హిందూ మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ నారాయణ

మనుబోలు : పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ విస్తరణాధికారి నారాయణ సూచించారు. మనుబోలు పంచాయతీ కార్యాలయంలో ఆయన శనివారం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, వీధి కుక్కల సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం సిబ్బంది హాజరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి గరుడయ్య ఉన్నారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

పొదలకూరు : వీఏఏలు, ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులకు పంట సాగులో అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రసన్నరాజేష్ అన్నారు. స్థానిక పరిశోధనా స్థానంలో పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల వీఏఏలు, ఏఈఓలకు ఒకరోజు శిక్షణా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము, పెసర చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. వేరుశనగలో అధిక దిగుబడులు ఇచ్చే టీసీజీఎస్ 1694, కదిరి లేపాక్షి రకం విత్తనాలు లభ్యమయ్యే చిరునామాలను అందజేశారు. నెల్లూరు డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి, ఏఓ మైథిలీ, ఏఆర్ఎస్ ఎంటమాలజీ శాస్త్రవేత్త సురేఖాదేవి, జీబీఎస్ఎఫ్ డీపీఎం మాలకొండయ్య తదితరులు విత్తనాల పంపిణీపై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వెంకురెడ్డి ద్వారా అవగాహన కల్పించారు. ఏడీఏ శివనాయక్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త హసీనా, ఏఓలు ఎ.వాసు, శశిధర్, ప్రతాప్, జహీర్, సోమసుందర్ పాల్గొన్నారు.

నకిలీలతో ఆరోగ్యం గుల్ల

- విచ్చలవిడిగా స్నాక్స్ విక్రయాలు
- పిల్లలను ఆకట్టుకునేలా ప్యాకింగ్
- కానరాని నాణ్యత ప్రమాణాలు
- పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు





దుకాణాల్లో తినుబండారాల ప్యాకెట్లు

నెల్లూరు(బారకాసు): స్నాక్స్ అంటే చిన్నారులతో పాటు పెద్దలకూ అమిత ఇష్టం. అయితే ఈ ఇష్టాన్నే కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రముఖ కంపెనీలు లేస్, కుర్కురేను పోలి ఉండేలా ఒకట్రెండు అక్షరాల తేడాతో రూపొందించే నాసిరక ఉత్పత్తులను తమ దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నా, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఫలితంగా వీరి ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది.

హానికర రసాయనాలు

ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో లభించే స్నాక్స్ లాంటి చిరుతిండ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలనూ వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించే వారే కరువయ్యారు.

పర్యవేక్షణేదీ..?

టీ కొట్టు మొదలుకొని కిరాణా షాపులు, బేకరీలు, ఫుట్‌పాత్, బస్టాండ్లలో వ్యాపారుల వద్ద సైతం ఇవి లభిస్తాయి. రూపాయి నుంచి రూ.పది వరకు ఇవి లభ్యమవుతున్నాయి. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. బడికెళ్లే చిన్నారులు తమ తల్లిదండ్రులిచ్చిన పాకెట్ మనీతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు మారం చేయగానే వీటిని దగ్గరుండి మరీ కొనిస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా.. ఒకట్రెండు అక్షరాలు అటూ, ఇటూ చేసి కంపెనీల పేర్లు పెట్టుకొని మార్కెటింగ్ చేస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజార్, చిన్నబజార్ తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ దుకాణాల ద్వారా ఆయా స్నాక్స్ ప్యాకెట్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్న దుకాణాలకు సరఫరా చేస్తున్నారు.

ప్రతి నెలా రూ.కోటి విలువైన సరుకు దిగుమతి..!

చెన్నై, విజయవాడ, హైదరాబాద్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నగరానికి దాదాపు రూ.కోటి విలువజేసే తినుబండారాలు ప్రతి నెలా దిగుమతవుతున్నాయి. వీటి కోసం ఒక్కో హోల్‌సేల్ వ్యాపారి నెలకు రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

కమీషన్ మాయ

బ్రాండెడ్ కంపెనీలు రూపొందించే తినుబండారాలతో పోలిస్తే వీటిని విక్రయిస్తే వచ్చే కమీషన్ ఎక్కువ మొత్తంలో ఉంటుంది. దీంతో చాలా మంది వ్యాపారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ చిప్స్ 12 ప్యాకెట్లు ఉండే ఒక షీట్ అమ్మితే రూ.ఆరు కమీషన్ వస్తే, వీటి ద్వారా రెట్టింపాదాయం వస్తోంది.

నామమాత్రంగా తనిఖీలు

మార్కెట్లో లభించే తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, మున్సిపల్, తూనికలు, కొలతల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఇవి రుచిగా ఉండేందుకు అధిక మోతాదులో మసాలాలు, ఉప్పును కలుపుతున్నారు. రంగుల కోసం పొడర్లను ఉపయోగిస్తున్నారు. వీటిని తినడం ద్వారా రోగాలొచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



మార్కెట్లో లభ్యమయ్యే తినుబండారాలు, జంక్ ఫుడ్‌కు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలతో పాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులొచ్చే అవకాశం ఉంది. పిల్లలు, పెద్దలు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

అవగాహనతో ఓస్టియోపొరోసిస్ దూరం

నెల్లూరు(అర్బన్): తగిన అవగాహన.. జాగ్రత్తలు పాటించడం ద్వారా ఓస్టియోపొరోసిస్ (ఎముకలు గుల్లబారడం)ను దూరం చేయొచ్చని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రికి చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ కుమార్ బాబు, సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఓస్టియోపొరోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. ఈ వ్యాధి ద్వారా ఎముకలు త్వరగా విరిగి వైకల్యమొచ్చే అవకాశముందని చెప్పారు. తగిన వ్యాయామంతో పాటు విటమిన్ డీ, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పక్షవాతంతో కిందపడి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటలోని చాకలివీధిలో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్ (54) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న కళ్లు తిరిగి ఇంట్లో కిందపడటంతో తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. పరీక్షించిన వైద్యులు పక్షవాతం వచ్చిందని, అందుకే కిందపడ్డారని చెప్పారు. మెరుగైన వైద్యం నిమిత్తం నారాయణకు, అనంతరం తిరిగి జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి పెద్ద కుమారుడు బాలసుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

విజ్ఞానంతో కూడిన విద్యనందించాలి



బహుమతులను అందుకున్న విద్యార్థులతో అధికారులు

నెల్లూరు(అర్బన్): ఆటలు, పాటలు, వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలను నిర్వహించడం ద్వారా విజ్ఞానంతో కూడిన విద్యను విద్యార్థులకు అందించొచ్చని డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఈఓ రామారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.ఐదు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలను పంపిణీ చేశారు.

విజేతలు వీరే..

- వ్యాసరచన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన శ్రీవిద్య హన్సిక, దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అఫ్రిద్, కొడవలూరు మండలం గంగపట్నం జెడ్పీ పాఠశాలకు చెందిన సుచిత్ర నిలిచారు.
- వక్తృత్వ పోటీల్లో బుచ్చిరెడ్డిపాళెం జెడ్పీ పాఠశాలకు చెందిన భవ్యశ్రీ, చెన్నపల్లిపాళెం జెడ్పీ పాఠశాలకు చెందిన లాలన, కొండాపురం మండలం నేకునాంపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి వర్షిణీ ప్రియ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- చిత్రలేఖన పోటీల్లో మొదటి మూడు స్థానాలను రామచంద్రాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి గౌతమి, గండవరం జెడ్పీ పాఠశాలకు చెందిన శివాని, చెముడుగుంట జెడ్పీ పాఠశాలకు చెందిన సురేంద్ర సాధించారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ ఉమామహేశ్వరి, ఎఫ్పీసీ నోడల్ ఆఫీసర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం, డీఎస్ఓ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33 / 11 కేవీ వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలో గల పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల మార్కెట్, వీఆర్సీ సెంటర్, చాకలివీధి, ఆచారివీధి, మహబ్‌పేట, సోమశేఖరపురం, కాంప్లెక్స్ రోడ్డు, పొగతోట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

టౌన్‌ప్లానింగ్ డీసీపీగా పద్మజ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగ డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ)గా పద్మజ నియమితులయ్యారు. విశాఖపట్నం కార్పొరేషన్లోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు తన జాయినింగ్ రిపోర్టును అదనపు కమిషనర్ శర్మదకు శనివారం అందజేశారు.

డిస్లెక్సియా ఫర్ వాక్‌పై అవగాహన

పొదలకూరు : డిస్లెక్సియా(ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు) ఫర్ వాక్‌పై శనివారం స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.సనత్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల 2016 చట్టప్రకారం ఇరవై ఒక్క రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఒకటిగా పేర్కొన్నారు. పిల్లలకు ప్రత్యేక శిక్షణ ద్వారా వైకల్యాన్ని అధిగమించేందుకు అవకాశం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్పులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రమేష్, ఉపాధ్యాయులు ఏవీ సుధాకర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్యాస పూజ



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్ రోడ్డు సమీపంలోని ఇస్కాన్ మందిరంలో డాక్టర్ శుకదేవస్వామికి వ్యాసపూజను శనివారం నిర్వహించారు. తొలుత మందిరంలో కొలువైన జగన్నాథ, బలదేవ, సుభద్ర, రాధా శ్యామసుందర్, శ్రీలప్రభుపాదుల వారికి విశేష పూజలు చేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, అడ్వొకేట్ దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఆనం



నెల్లూరు(క్రైమ్): నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఆయన కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిసి పూల మొక్కను అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై డీఎస్పీతో చర్చించారు. పార్టీ రూరల్ మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్ రెడ్డి, నేతలు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ వైన్ షాపులా..?



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో మద్యం దుకాణాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా విమర్శించారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. నివాసాలు.. విద్యాసంస్థలు.. ప్రార్థన మందిరాల సమీపంలో ఏర్పాటు చేయకూడదనే నిబంధనను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. ఇలా వ్యవహరించకుండా కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు. నేతలు బాదుల్లా, గౌస్‌బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బారకాసు): అక్రమ కట్టడాలను తొలగించే ప్రక్రియకు టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులు శ్రీకారం చుట్టారు. 54వ డివిజన్లోని వెంకటేశ్వరపురం, గొర్రెల గంజిఖానా వద్ద అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీ సాయంతో శనివారం తొలగించారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలను గుర్తించి తొలగించనున్నారు.

ఘనంగా వార్షికోత్సవ ఆరాధన



సంఘ పెద్దలకు సత్కారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ నూతన భవన 11వ వార్షికోత్సవ ఆరాధనను శనివారం ఘనంగా నిర్వహించారు ప్రత్యేకారాధనలో సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్ సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. సంఘంలో 65 ఏళ్లు నిండిన పెద్దలను సత్కరించారు. గాయక బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎవాంజిలికల్ డైరెక్టర్ గంటా జార్జిస్టీవెన్సన్, బీకస్స్ వరప్రసాద్, కృపారాజన్, కృపాల్, క్వైర్ డైరెక్టర్ బిల్లీ శ్యామ్‌సన్, సంఘ పెద్దలు నిర్మలసుధాకర్, ప్రమీలాజాన్, నిర్మల మణిరావు, జమ్ముల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈకి సత్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ బదిలీ అయిన తరుణంలో ఆయన్ను శనివారం ఘనంగా సత్కరించారు. రామలింగాపురంలోని సర్కిల్ ఆఫీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజినీర్ శరత్‌కుమార్ రెడ్డి, ఎస్డీఏ ఉషా, హెచ్‌డీ విజయకుమార్, సూపరింటెండెంట్ కృష్ణ, డీఈలు గోపీకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌పీల సేవలు అమూల్యం



పీహెచ్‌పీ నేతలను సత్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో అతితక్కువ ఖర్చుకే ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలందిస్తున్న పీహెచ్‌పీల సేవలు అమూల్యమైనవని డాక్టర్లు అజయ్‌కుమార్, వసుమతి పేర్కొన్నారు. పొగతోటలోని పసుపులేటి మెటర్నిటీ, ఫర్టిలిటీ హాస్పిటల్లో పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్యను శనివారం సత్కరించారు.

హరిహర సుతయే శరణమయ్యప్ప

- సింహపురి శబరిమల.. వేదాయపాళెంలోని అయ్యప్ప ఆలయం
- ప్రతిధ్వనిస్తున్న శరణుఘోషలు



వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి ఆలయం

నెల్లూరు(బృందావనం): భక్తి గీతాలాపనలు.. నిత్య సంప్రదాయ విశేష పూజలు.. ఉత్సవాలు.. సేవలతో మరో శబరిమలగా సింహపురిలోని అయ్యప్పస్వామి ఆలయం అలరారుతోంది. అయ్యప్ప దీక్షలు.. మాలధారణలు.. ఇరుముడులు.. భజనలతో అయ్యప్పస్వామి సన్నిధి ప్రత్యేకతను సంతరించుకుంది. శబరిమల తరహాలో అదే వాస్తుతో సింహపురిలో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది.

ఆధ్యాత్మిక చింతన

అయ్యప్ప ఆలయానికి శంకుస్థాపనను శృంగేరీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు ఫిబ్రవరి 6, 1982లో నిర్వహించారు. అనంతరం నగరంలోని ఎందరో ప్రముఖుల భాగస్వామ్యంతో జీవం పోసుకున్న అయ్యప్ప సేవా సమాజ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 1987లో కేరళకు చెందిన వడకేడత్తు పెరుంబడప్పుమన కేశవన్ నంబూద్రిపాద్ తంత్రి విగ్రహ ప్రతిష్ఠ చేసి కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. నాటి నుంచి నేటి వరకు దాదాపు 40 ఏళ్లుగా అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్విఘ్నంగా సాగిస్తూ ఆధ్యాత్మిక చింతనను పరిఢవిల్లజేస్తున్నారు.

ఏటా 41 రోజులు మండల, నిత్య పూజలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు అయ్యప్ప దేవస్థానాలున్నా, శబరిమల సంప్రదాయ పద్ధతుల్లో కేరళ నంబూద్రిలతో ఏటా నవంబర్ 16 నుంచి డిసెంబర్ 26 వరకు 41 రోజుల పాటు మండల పూజలు, నిర్మాల్య దర్శనం, ఉషఃపూజ, శీవేలి ఉత్సవం తదితరాలను నిర్వహిస్తున్నారు. ఇలా జరిగే ఏకైక దేవస్థానం ఇక్కడి అయ్యప్పస్వామి ఆలయం కావడం విశేషం.

భక్తులకు వసతి, సౌకర్యాలు



దాతల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నప్రసాద వితరణ చేస్తున్నాం. 41 రోజుల మండల దీక్ష కాలంలో రోజుకు 800 నుంచి వెయ్యి మందికిపైగా.. సాధారణ రోజుల్లో సుమారు 200 నుంచి 400 మందికి అన్నప్రసాదాన్ని అందజేస్తున్నాం. ఏటా 15 వేల నుంచి 20 వేల మంది మాలధారణ చేస్తారు. అయ్యప్ప భక్తులు స్నానమాచరించేందుకు వీలుగా షవర్స్, బాత్రూమ్స్, టాయ్‌లెట్లను ఏర్పాటు చేశాం. దాదాపు పదేళ్ల క్రితం గోశాలను ఏర్పాటు చేసి 25 గోవుల ఆలనాపాలనా చూస్తూ వాటి ద్వారా వచ్చే పాలనే స్వామి వారికి నివేదనకు వినియోగిస్తున్నాం.

– శేషగిరిరావు, వెంకటరత్నం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అయ్యప్ప సేవా సమాజం

మాలధారణతో ఆధ్యాత్మిక చింతన



చెన్నైలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నా. మాలధారణను మూడేళ్లుగా స్వీకరిస్తున్నా. దీని ద్వారా ఆధ్యాత్మిక చింతన కలుగుతోంది. భక్తిమార్గంలో పయనించేందుకు, నియమ.. నిష్ఠలు ఎంతో తోడ్పడుతున్నాయి. అయ్యప్ప అనుగ్రహంతో ఏటా కొనసాగిస్తా.

– వెంకటేశ్వర్లు, మూలాపేట